నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | మార్చి 17, 2025 | www.navatelangana.com

వంజరి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్



వంజరి సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కార్పె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కానుకంటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా దొనగిరి రాజు, కోశాధికారిగా దొనగిరి చరణ్, సభ్యులుగా నామెడ శేఖర్, కార్పె వినోద్, లండేరి నారాయణ, లండేరి రవి, కాలేరి సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మంజరి కులం సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తానన్నారు.

వారంతా ఒకే చోట చదివారు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి చదివిన 2010-11 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ గార్డెన్‌లో 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' ఏర్పాటు చేసుకున్నారు. 'ఆనాడు చదివిన జ్ఞాపకాలు, మధుర స్మృతులను స్మరించుకుంటూ మాట్లాడుతూ మురిసిపోయారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సైతం కార్యక్రమానికి ఆహ్వానించి శాలువాలతో సన్మానించి సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పదిహేనేండ్ల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకోగా, మళ్లీ ఇలా కలుస్తామని అనుకోలేదన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఎప్పుడైనా విజయం సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగారెడ్డి, గంగన్న, ప్రమోద్, పవన్ సంతోష్, సుదీర్, పూర్వ విద్యార్థులు అజయ్, నాగరాజు, మహేష్, దివ్య, పర్వీన్, క్షమ, గంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గడువులోపు పూర్తయ్యేనా..?

- గ్రామాల్లో సాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు
- మరో పక్షం రోజుల్లో పూర్తిచేస్తేనే ఫలితం
- సమయం మించితే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం
- హడావుడి పనులతో నాణ్యతపై అనుమానాలు

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద ప్రతి ఏటా నిధులు మంజూరు చేస్తోంది. ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం చివరలో వీటిని మంజూరు చేయగా.. అధికారులు నామినేషన్ పద్ధతిలో స్థానిక గుత్తేదారులు, ప్రజాప్రతినిధులకు పనులను అప్పగిస్తున్నారు. కానీ నిర్దేశిత గడువులోపు రోడ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడం కారణంగా చాలా వరకు నిధులు వెనక్కి వెళ్తున్న పరిస్థితులున్నాయి. తాజాగా ఈ ఏడాది సైతం ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు ఉపాధిహామీ కింద రూ.66.41కోట్లను మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నపులు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాకు 1529 పనులు మంజూరు కాగా.. ఇప్పటి వరకు కేవలం 132 పనులు మాత్రమే పూర్తయ్యాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. మిగితా పనుల పూర్తికి పక్షం రోజులే గడువు ఉన్న దృష్ట్యా పూర్తికావడం గగనంగా మారుతోంది.



ఆదిలాబాద్ మండలం వాన్‌వాట్ గ్రామంలో వేసిన సీసీ రోడ్డు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ పనుల్లో లోపాలు, నిధులు సక్రమంగా రాకపోవడం వంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరడం లేదు. ఇప్పటికీ అనేక పల్లెల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి ఏటా రూ.కోట్ల నిధులు కేటాయిస్తున్నా వాటిని వినియోగించుకోవడంలోనూ విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది. తాజాగా ఈ ఏడాది మొదటి, రెండో విడతలో ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు రూ.66.41కోట్లతో 1529 పనులను మంజూరు చేసింది. తొలి విడతలో 39.86కోట్ల పనుల మంజూరు చేయగా.. రెండో విడతలో రూ.26.55కోట్లు కేటాయించింది. ఆదిలాబాద్ నియోజకవర్గానికి 366పనులు, బోథ్‌కు 857, ఆసిఫాబాద్‌కు 242, ఖానాపూర్‌కు 163 పనులు మంజూరయ్యాయి. ఈ పనులను అధికారులు నామినేషన్ పద్ధతిన స్థానిక గుత్తేదారులు, ఔత్సాహికులకు అప్పగించింది. ఈ పనులను ఈ నెలలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తిచేసిన పనులకు ఈ నెల 31తేదీ వరకు ఎంబీ రికార్డు కూడా చేయాల్సి ఉంటుంది. కానీ పనులు చేపట్టడంలో తాత్సారం జరగడం.. ప్రారంభించడంలో ఆలస్యం చేయడం.. పూర్తిచేసిన వాటికి ఎంబీ రికార్డులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం కారణంగానూ పనుల్లో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది.

గడువులోపు పూర్తయ్యేనా..?

ఉపాధిహామీ కింద రోడ్ల నిర్మాణం చేపట్టడటం గ్రామీణ ప్రాంతాలకు వరంలా మారితే.. ఈ పనులు చేపట్టిన వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. వివిధ ఆటంకాల కారణంగా ఈ పనులు సకాలంలో పూర్తికావడం గగనంగా మారుతోంది. పనులు చేపట్టిన వారికి బిల్లులు సకాలంలో రాకపోవడం పెద్ద సమస్యగా మారుతోంది. కిందటేడాది వేసిన సీసీ రోడ్డుకు ఇప్పటికీ బిల్లు రాలేదని తాంసి మండలానికి చెందిన ఓ తాజామాజీ సర్పంచ్ అవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అధికారులు ఎంబీ రికార్డులు తయారుచేయడంలోనూ తీవ్ర ఆలస్యం చేస్తుండటం వంటి కారణాలు సమస్యగా మారుతున్నట్లు పలువురు చెబుతున్నారు. అనేక మంది అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టిన వారు బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పులు పెరిగిపోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలాంటి కారణాలతోనే ఈ పనులు చేపట్టేందుకు చాలా మంది ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మరోపక్క ప్రస్తుతం ఇసుక లభించడం కూడా సమస్యగా మారుతోంది. ప్రభుత్వం ఇసుకపై ఉక్కుపాదం మోపుతుండటంతో అక్రమమార్గాల్లో తీసుకొచ్చే వారు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతోనే అనేక మంది ఈ పనులు చేపట్టడంలో అనాసక్తి చూపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వెనక్కి వెళ్లే ప్రమాదం..!

జిల్లాకు ఉపాధిహామీ కింద మంజూరైన ఈ పనులు ఈ నెలాఖరు వరకు మాత్రమే పూర్తి చేయాలి. ప్రస్తుతం కొన్ని చోట్ల మాత్రమే పనులు పూర్తికాగా..మరికొన్ని చోట్ల ప్రారంభమయ్యాయి. ఇంకా అనేక చోట్ల మొదలు కాలేదని తెలుస్తోంది. మరో పదిహేను రోజుల్లో ఈ పనులు ప్రారంభించకుంటే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంటుంది. మరోపక్క హడావుడిగా పనులు చేపడుతుండటంతో వాటి నాణ్యతపైనా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. క్యూరింగ్ సక్రమంగా లేకపోవడం.. ఇష్టారీతిన నిర్మిస్తుండటం కారణంగా వేసిన ఆరు నెలల్లోపే పగుళ్ల తేలుతున్న సందర్భాలున్నాయి. మరోపక్క అధికారుల పర్యవేక్షణ కూడా అంతగా ఉండటం లేదు. జిల్లాలో 17మంది ఏఈలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 9మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో అన్ని చోట్ల పనుల పర్యవేక్షణకు అధికారుల లేమి ఆటంకం కలిగిస్తోంది. ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి పనులు సత్వరం ప్రారంభించి పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ పనుల విషయమై పంచాయతీరాజ్ ఈఈ శివరాంను ఫోన్లో సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

ప్రయివేటుపరం చేసేందుకు కుట్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంత్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని యాదవసంఘ భవనంలో ఏఐకేఎస్ జిల్లా 7వ మహాసభలను ఘనంగా నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయ రంగంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ దేశం వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉందన్నారు. 150 కోట్ల మందికి ఆహారాన్ని అందించే ఈ రంగాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయరంగం నుంచే 18 శాతం జీడీపీ సమకూరుతున్నా రైతన్నలను మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, రైతుల సమస్యలను తీర్చడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాల రద్దు చేయాలని రైతులు చేపట్టిన ఉద్యమంలో 764 మంది రైతులు మృతి చెందగా, మోడీ ప్రభుత్వం దిగివచ్చి చట్టాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. మళ్లీ దాన్ని దొడ్డిదారిన అమలు చేస్తోందని ఆరోపించారు. అందులో భాగంగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకువచ్చి ఎద్దేవా చేశారు. దీంతో రైతులకు మార్కెట్ వ్యవస్థ లేకుండా పోతుందని, ప్రైవేటు కంపెనీలు ఎక్కడ పడితే అక్కడ మార్కెట్ ఏర్పాటు చేసి కొనుగోలు చేసే ఆస్కారం ఉందన్నారు. ఇదే జరిగితే రైతులు మరింత నష్టపోయే వీలుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా రైతులను చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, చిలుక దేవిదాస్, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు పోశెట్టి, మేస్రం భాస్కర్, కేశవ్, నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు

- జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పట్టణ పరిధిలో ఉన్న రిసార్ట్స్, లాడ్జీలు, హెూటల్స్, దాబాలను జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. లాడ్జి నిర్వాహకులకు వచ్చిపోయే అతిథులకు సంబంధించి ఆధార్‌కార్డులో ఉన్న వివరాలను తప్పనిసరిగా ధవీకరించాలని సూచించారు. లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలతో పాటు నిబంధనలను అతిక్రమించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ అంబేద్కర్ జ్ఞాన భీమ్ దీక్ష ప్రారంభం

నవతెలంగాణ నిర్మల్ టౌన్

బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్ఞాన భీమ్ దీక్ష ప్రారంభించారు. గౌతమ బుద్ధుడు విగ్రహానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాన్యశ్రీ కాన్సిరాం చిత్రపటానికి పూలమాలవేసి జయంతిని జరిపారు. మార్చి 15 కాన్షిరాం జయంతి నుంచి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు జరిగే అంబేద్కర్ జ్ఞాన దీక్ష భీమ్ దీక్షను స్వీకరించడం జరిగింది. ఒక వ్యక్తి తన ఇంద్రియాలను నిగ్రహపరచుకొని జ్ఞానాన్ని పెంచుకోవడం కోసం చేసే దీక్ష అంబేద్కర్ జ్ఞాన దీక్ష భీమ్ దీక్ష అని అన్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర నాయకులు దాడోల్ల క్రాంతి కిరణ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొంతం మురళీధర్, భుజంగరావు గైక్వాడ్, స్థానిక బుద్ధ విహార కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుంటోల్ల వెంకటస్వామి, మధుకర్ మునేశ్వర్, జాడే బీమ్ రావ్, బత్తుల రంజిత్, పిల్లి నాగయ్య, చేపూరి సిద్ధార్థ, ఈనాడు సిద్ధార్థ, ఈరోల పురుషోత్తం, రావుల గంగన్న, ఏలుగు రాజన్న, భగత్ నారాయణ, కల్లూరు సాయన్న, మధుకర్ గాయక్వాడ్, అడిగ బోస్, బొడ్డు నరేష్, రావిన్, దేవుళ్ళ రాజ్, సింగరి జగదీశ్వర్, డాన్ శీను పాల్గొన్నారు.

3 తులాల బంగారు పుస్తేలతాడు చోరీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఒంటరిగా ఉన్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు దొంగలించిన సంఘటన పట్టణంలోని గోదావరి రోడ్డుకు ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ వివరాల ప్రకారం గోదావరి రోడ్డుకు చెందిన కొత్త శ్యామల ఇంట్లో ఒంటరిగా ఉండటం గమనించిన ఓ మహిళ ఆమె ఇంట్లోకి చొరబడి మెడలోని సుమారు 3 తులాల బంగారు పుస్తెలుతాడు లాక్కొని పరారైంది. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా కార్తికేయ హాస్పిటల్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ ప్రముఖ వైద్యులు డా.శ్యామ్‌ప్రసాద్, డా.సుమలత ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కార్తికేయ హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. కరోనా వంటి కాలంలో వైద్యులు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1983లో బోథ్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మర్సుకొల కాశీరాం నియోజకవర్గ ప్రజలకు మంచి పాలనను అందించారని, ఇప్పుడు ఆయన మనవరాలు నైతం సుమలత సైతం తాత అడుగు జాడల్లో నడుస్తూ వైద్య రంగంలో విశేష సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రతినిధులు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొని వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావ్, పాల్గొన్నారు.

దేవాపూర్ పాఠశాలలో అంత వారిష్టమే

- విద్యార్థుల గోడు ఎవరికి పట్టదు
- పై అధికారుల పర్యవేక్షణ కరువు

నవతెలంగాణ-తలమడుగు



అదిలాబాద్ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో గల మండలంలోని దేవాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బోధనతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వారి వారి ఇష్టానుసారంగా అమలు చేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై ముగియవస్తున్నప్పటికీ ఆ పాఠశాల విద్యార్థులకు పప్పు నీళ్లే దిక్కవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మెనూ ఏ మాత్రం పాటించకుండా అంత వారిష్టమే అన్నట్లుగా కొనసాగిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు మధ్యాహ్న భోజనంలో అందించకపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఈ పాఠశాలలో 155 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించే దిశగా మెస్ చార్జీలు పెంచినప్పటికీ ఇక్కడ మాత్రం అవేవి మచ్చుకైనా కానరావడం లేదు. ప్రభుత్వం మారి నూతన మెనూ అమలవుతుండగా ఇప్పటికీ మెనూ పట్టిక మార్చకపోవడం పరిస్థితికి నిదర్శనం. ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిని అడగగా విద్యార్థులకు దురద, తామర ఉండడంతో కూరగాయలు వండిపెట్టడం లేదని బదులిచ్చారు. పదవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని అడగగా పాఠశాల మొదలైనప్పటి నుండి ఎలాంటి కూరగాయలు తినలేదని తెలిపాడు. పప్పుతో పాటు ఇతర కూరగాయలు ఇస్తే తినేందుకు వీలుంటుందని చెప్పుకొచ్చాడు. ప్రతినిత్యం పప్పన్నం అందిస్తుండటంతో కొంతమంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తిని వస్తున్నట్లు తెలిపారు.

జిల్లాస్థాయి అధికారులు వస్తే మాకేంటి

దేవాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మండల విద్యాధికారి వెంకట్రావు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ (ఏఐ) కంప్యూటర్ శిక్షణ ప్రారంభోత్సవానికి వస్తున్న విషయం తెలిసినప్పటికీ పాఠశాలలో మెనూ ఏ మాత్రం మారలేదు. ప్రారంభోత్సవానికి వచ్చిన అధికారుల దృష్టి అటు వైపుగా వెళ్లకపోవడం గమనార్హం.

అలరించిన అష్టావధానం



నవతెలంగాణ-ముథోల్

చదువుల తల్లి పుణ్యక్షేత్రమైనా బాసరలోని శారదనగర్‌లో గల కోటిపార్థివ లింగస్థాప సాహితి ద్వాదశజ్యోతిర్లింగ మందిరంహాల్లో ఆదివారం విశాఖపట్నం వాస్తవ్యులు ప్రముఖ అవధానులు బొల్లా ప్రగడ శశిశర్మచే నిర్వహించిన అష్టావధానం ఆద్యంతం ఆకట్టుకుంది. నిర్వాహకులు, పద్యకవులు, సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు బి.వెంకట్ కవి, శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు నిర్మల అంబిక నాథశర్మ నేతత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు సంచాలకులుగా పద్యకవులు బొందిడి పురుషోత్తమరావు, ప్రాశ్నికులుగా డా.కోవెల శ్రీనివాసాచార్యులు (నిషిద్ధాక్షరి), కడారి దశరథ్ (సమస్యాపూరనం), బి.వెంకట్ (దత్తపది), పీసర శ్రీనివాస్ గౌడ్ (వర్ణన), గంగుల చిన్నన్న (న్యస్తాక్షరి), కొండూరు పోతన్న (ఛందోభాషణము), జాదవ్ పుండలీక్ రావు పటేల్ (ఆశువు), బసవరాజు (అప్రస్తుతప్రసంగం)లతో ఈఅష్టావదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వాస్తవ్యులు కవి, పండితులు, సమస్యా పృచ్ఛక పద్య వశంకర కంది శంకరయ్య, కవులు, కళాకారులు, సాహితి అభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వారిచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

పూటకో మాట మారుస్తున్న రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ పై సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మారుస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చనప్పుడు ఒక మాట మాట్లాడితే గత ఏడు నెలలుగా ఊసరవెల్లిలా మాటలు మారుస్తూ వస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో వర్గీకరణను అమలుచేసి మాదిగలకు న్యాయం చేస్తానని చెప్పి, ఇప్పుడేమో వేలాది ఉద్యోగాల ఫలితాలను ప్రకటిస్తూ మాట తప్పారని మాదిగ నిరుద్యోగులకు నమ్మక ద్రోహం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా తము న్యాయం చేయాలని లేదంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ దీక్షల్లో సీనియర్ నాయకులు, ఇండ్ల ఎల్లన్న, సందూరి వినయ్ సాగర్, ఆరేపల్లి గణేష్, రోడ్డ గంగన్న, ప్రహ్లాద్, గణేష్, వినయ్, రాజు పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారంతో ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుడాల స్వామి మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం చేయకుండానే ప్రభుత్వ ఫలితాలను వెల్లడిస్తూ సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాత రేస్తోందన్నారు. ఇది తీరని అన్యాయమన్నారు. ఇందుకు కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించడం తప్పదన్నారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి సామాజిక న్యాయం చేయాలన్నారు. ఇందులో నాయకులు గంగయ్య, రాజేందర్, రమణయ్య, లక్ష్మణ్, అశోక్, చింటు పాల్గొన్నారు.



ఒకే దేశం - ఒకే ఎన్నిక పై కార్యశాల నిర్వాహణ

నవతెలంగాణ-నిర్మల్ టౌన్



ఒకే దేశం-ఒకే ఎన్నిక పై జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కార్యశాల నిర్వాహణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, జిల్లా కన్వీనర్ అచ్యుత్‌రావ్ హాజరై మాట్లాడారు. దేశంలో ఒకే ఎన్నిక నిర్వహణతో ఎన్నికల నిర్వహణ ఖర్చులు మిగిలి, ఆ నిధులతో అభివృద్ధికి వీలవుతుందన్నారు. ప్రతీ గ్రామానికి ఒకే దేశం - ఒకే ఎన్నిక అనే అంశాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న 2029లో కేంద్ర ప్రభుత్వం "ఒకే దేశం-ఒకే ఎన్నిక"ను తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, పడిపెల్లి గంగాధర్, చిన్నారెడ్డి, రవీందర్ రెడ్డి, సతీష్ రావు, శ్రీనివాస్, అశోక్, సాయినాథ్‌తో పాటు మండల కన్వీనర్లు, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోంది

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఆదివారం రూరల్ మండలంలోని నిలాయిపేట్ గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని దీనిలో భాగంగా సీసీ రోడ్డు మంజూరు చేసిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌కు సూపర్ లగ్జరీ బస్సు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ డిపో నుండి ఖానాపూర్ మీదుగా మెట్‌పెల్లి, ఆర్మూర్ మార్గంలో శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌కు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఖానాపూర్ బస్టాండ్ నుంచి సాయంత్రం 05:30 గంటలకు తిరిగి శంషాబాద్ నుంచి మరుసటి ఉదయం 07:00 గంటలకు బయల్దేరి డిపోకు చేరుకుటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కరిపే విలాస్ చిన్నాన్న కరిపే శంకర్ ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా బీజేపీ నేత సత్య నారాయణ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి కారణాలను తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు రాజారెడ్డి ఉన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు ఇర్ల అభిలాష్ కుమారుడు అగ్రజ్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్మల్‌లోని వద్ధాశ్రమంలో కటుంబసభ్యులతో కలిసి జరుపుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను డబ్బులు వధా చేయకుండా సేవా కార్యక్రమాలను ఉపయోగించాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీఓ సుమలత అన్నారు. ఆదివారం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై టీచర్స్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, టీపీఓ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను పరిశీలించి సందేహాలను నివృత్తి చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ ఉన్నందున సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా టీపీఓ సుమలత మాట్లాడుతూ 2020లో అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యికట్టి దరఖాస్తు చేసుకున్న వారి కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మార్చి 31లోపు ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. అక్రమ లే అవుట్లలో పది శాతం రిజిస్ట్రేషన్ అయిన వారు కూడా క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలున్న మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు అందుబాటులో ఉండి నివృత్తి చేస్తారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-కడెం



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సొగ్గల సుధాకర్‌కు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రూ.45వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించామని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.3 లక్షల నిధులతో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ నాయకులు భూమి పూజ చేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశానుసారంగా మండలంలో కొత్తూరు గ్రామంతో పాటు వివిధ గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ కుమార్, నాయకులు పిడుగు అభిరామిరెడ్డి, ఆశన్న యాదవ్, మాడూరి రమాకాంత్, షేక్ అబ్దుల్లా, రాగిరామ్ కిషన్, పల్లవి ఠాకూర్, రాంబాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచు వివాహానికి సాయం



నవతెలంగాణ-కడెం

మండలంలోని గండిగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ దేవక్క కుమార్తె సుమలత వివాహానికి ఆర్థిక సోమత లేక ఇబ్బంది పడుతున్న కుటుంబానికి ఉడుంపూర్ మాజీ సర్పంచ్ జొన్నల సావిత్రి రాజయ్య గుప్తా, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా అండగా నిలిచారు. ఆదివారం వివాహానికి హాజరై పెళ్లి కుమార్తెకు పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ధొంతుల శ్రీనివాస్, కాశవేని లింగన్న యాదవ్, కొట్టే రాజన్న, నర్సింహ శాస్త్రి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రంజాన్ సరుకుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని దారుల్ అన్సర్ వెల్ఫర్ సొసైటి ఆధ్వర్యంలో పట్టణంలోని కచ్చంటి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో సరకులను పంపిణీ చేశారు. రూ.1500 విలువ గల రేషన్ ప్యాకెజీలను 70 మంది పేదలకు అందించారు. పది సంవత్సరాలుగా సొసైటి తరపున సేవ కార్యక్రమాలు అందిస్తున్నామని మాజీ అధ్యక్షుడు ఖాజీ నజీమోద్దీన్ తెలిపారు. వేసవిలో చల్లటి నీరు, చలి కాలంలో దుప్పట్ల పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఏట మదిరిగానే ఈ సంవత్సరం కూడా రంజాన్ మాసంలో దాతల సహకారంతో పేదలకు సరకులను పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. ఇలానే దాతలు సహకారం అందించి పేదలకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సొసైటి మాజీ అధ్యక్షుడు ఖాజీ నజీమోద్దీన్, మహ్మద్ వసీం, మహ్మద్ రోషన్, ఆరీఫ్ ఖాన్, జమీద్, అబ్దుల్ మోయిజ్, అజ్జు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికభావాన్ని పెంపొందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రశాంతత ఆలయాలలోనే లభిస్తుందని, వాటిని కాలనీల్లో నిర్మించుకుంటూ ఆధ్యాత్మిక భావానాన్ని పెంపొందించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని రణదివేనగర్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి నిర్మాణానికి భూమి పూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన రామన్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతనమైన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆలయాల్లోనే ప్రశాంతత లభిస్తుందన్నారు. సంస్కృతి, సంస్కారం, ఆచారాలు, పరంపారాలను కొనసాగించాలన్నారు. నేటి తరం వారికి వాటిని అందిస్తు ఆధ్యాత్మిక భావం పెంపొందించాలన్నారు. కాలనీలో రామాలయ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఐక్యతగా ఉంటు ఆధ్యాత్మిక భావనను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోవ రవి, మహేందర్, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై గ్రామసభలు

నవతెలంగాణ-నార్నూర్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై ఆదివారం తాడిహత్నూర్, గుండాల, మాన్యాపూర్, గంగాపూర్, నార్నూర్, సుంగాపూర్, ఎంపల్లి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. 2023 నుండి 2024 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ బృందం సర్వే చేసిన ఆయా రకాల పనులు, విడుదలైన నిధులను గ్రామ సభ ద్వారా ప్రజలకు వివరించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా వేదికలో పొరపాట్లను వివరించనున్నట్లు డీఆర్పీ రజిత పేర్కొన్నారు. ఇందులో ఈసీ సురేందర్, టీఏలు సాదిక్, లావణ్య ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్పీలున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం.. కోలాం గిరిజనం

- చేతి వృత్తులే జీవనాధారం
- కూడు గుడ్డ నీడ కరువు
- జన్ మన్ పథకం ఆదరించేనా..?



పాటగూడ గ్రామం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రస్తుతం సాకేంతిక పరిజ్ఞానం పెరిగి మానవుడు చంద్రమండలంలో అడుగిడిన ఆదివాసులు మాత్రం ఇంకా అభివృద్ధికి దూరంగా ఉన్నారు. ఆ గిరి గూడెల్లో నేటికి పెంకుటిల్లు కనిపిస్తాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు ఆదివాసులకు పథకాలను అమలు చేస్తున్నామని చెబుతున్న వీరికి దరి చేరడం లేదని తెలుస్తోంది. ఏజన్సీ ప్రాంతంలోని అత్యంత వెనుకబడిన పీవీటీజీ (కోలాం) గిరిజనులు నేటికి కూడు, గూడు, నీడ లేక అపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. మండలానికి కూత వేటు దూరంలో ఉన్న కోలాం గిరిజనులు నివసించే పాటగూడ గ్రామం. సుమారు ముప్పై కుటుంబాలు నివాసించే ఆ గ్రామం మారుతిగూడ, రాముగూడ ఈ మూడు గూడెలుగా ఏర్పడింది. ఇంకా ఆ గ్రామం పూరి గుడిసెలు, పెంకుటిల్లు, రేకులతో నిర్మించిన ఇండ్లలోనే నివాసం ఉంటున్నారు. వీరి ముఖ్య వృత్తి పోడు వ్యవసాయం చేసుకుంటూ వర్షాధార పంటలు జొన్న, కంది, పత్తి తదితర పంటలను సాగు చేస్తు జీవనం సాగిస్తున్నారు. భూమి లేని వారు తమ పూర్వీకుల నుంచి వస్తున్న చేతి వృత్తులపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు.



చేతి వృత్తులతో జీవనాధారం..

కోలాం గిరిజనులు చేతి వృత్తులతో తమ కుటుంబ పోషణ కొనసాగిస్తుంటారు. మారుమూల అడవుల్లోకి వెళ్లి వెదురును తెచ్చుకుంటారు. ఈ వెదురుతో గుల్లలు, తడకలు అల్లి అంగడి రోజున కాలినడక వెళ్లి అమ్ముకుంటారు. వీరు అల్లిన వివిధ వస్తువులను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టణ, మండల ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటారు. కోలాం గిరిజనులు చేతి వృత్తుల ద్వారా చేసిన తడకలు, గుల్లలు తదితర వస్తువులను తమ దగ్గర్‌లో ఉన్న సంతలోకి అమ్మి తమ కుటుంబానికి అవసరమయ్యే నిత్యావసర వస్తువులు, తిండి సామాగ్రిని తెచ్చుకుంటున్నారు.

జన్ మన్ పథకం ఆదుకొనేనా..?

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కోలాం గిరిజనులకు ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జన్ మన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కోలాం తెగకు విద్య, వైద్యం, జీవనోపాధి, రోడ్డు, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం ఇండ్లు లేని వారికి ఇండ్ల నిర్మాణం వంటి మౌలిక వసతులు కల్పించాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే పాటగూడ గ్రామంలో గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఈ జన్ మన్ పథకం ద్వారా ఇంతవరకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో వారు పూరి గుడిసెల్లోనే నివసిస్తున్నారు.

వేసవిలో తాగు నీటి ఎద్దడి..

ఈ గ్రామంలో ప్రతి ఏటా వేసవి కాలం వచ్చిందంటే చాలు నీటి ఎద్దడి నెలకొంటుంది. తాగు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఎవరికి చెబుకోవాలో కూడా తమకు తెలియదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి కోలాం ఆదివాసుల గ్రామాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జన్‌మన్ పథకం ద్వారా ఇండ్లు నిర్మించాలి

టేకం గంగారాం, మారుతి గూడ



తమ గ్రామంలో మొత్తం 14 కుటుంబాలు నివాసిస్తున్నాయి. జన్ మన్ పథకం ద్వారా పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. తాగు నీటి సౌకర్యం కల్పించాలి. వ్యవసాయం కోసం పీవీటీజీలకు ప్రత్యేక పంట రుణాలను అందించాలి.

సౌకర్యాలు కల్పించాలి

కుమ్ర తుకారాం, రాముగూడ



గ్రామంలో 20 కుటుంబాలు నివాసిస్తున్నాయి. కోలాం తెగ కోసం వ్యవసాయ కోసం ప్రభుత్వం ఉచితంగా బావులు, ఎడ్లను ఇవ్వాలి. అదే విధంగా గ్రామాలో సౌకర్యాలు కల్పించాలి. చదువుకున్న యువతకు స్వయం ఉపాధి కల్పించేల రుణాలను అందించి ఆదుకోవాలి.



వెదురుతో తడక అల్లుతున్న ఆదివాసీ మహిళ

దాడి చేసిన వారిని శిక్షించాలి

- సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కడెం

మండలంలోని లింగాపూర్ తండ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ మినీ టీచర్ శ్రీలతపై దాడి చేసిన వారిని శిక్షించాలని సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమవార్‌పేట్‌లో మినీ అంగన్‌వాడీ టీచర్‌ను నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాపూర్ తండ గ్రామానికి చెందిన గుగ్లావత్ సురేందర్ అతని కుటుంబ సభ్యులు టీచర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరచరని తెలిపారు. ఆమె అపస్మారక స్థితిలో వెళ్లడంతో నిర్మల్ దవఖానలో అడ్మిట్ చేశారని తెలిపారు. పోలీస్ దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ డిమాండ్ చేశారు.



మినీ అంగన్‌వాడీ టీచర్‌ను పరామర్శిస్తున్న సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకుర్ తిరుపతి, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బర్కం ప్రసాద, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు బట్టి రాణి, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఖానాపూర్ మాజీ వైస్ ఎంపీపీ వాల్ సింగ్ పాల్గొన్నారు.

ఏపీఓ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్‌ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఏపీఓ జనరల్ జాదవ్ వసంత్ తండ్రి నారాయణ్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కోట్నక్ రమేష్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, సీనియర్ పాత్రికేయులు రహీమోద్దీన్ మండలంలోని శంకర్‌తండాలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మోహన్ సింగ్, గ్రామస్తులు, నాయకులున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించిన పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనగానే అందరూ కలిసి ఆనందోత్సవాల మధ్య కార్యక్రమాలు నిర్వహించుకోవడం సహజం, కానీ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ 1992-93 పూర్వ విద్యార్థులు మాత్రం సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో భయాందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు జామెంట్రీ బాక్సులను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్ మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గతంలో సైతం ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆవుల మహేంద్ర, జైపాల్ రెడ్డి, కత్తురి కిరణ్ కుమార్, కన్నామీ నగేష్, ముస్కు మహేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తులు

నవతెలంగాణ-ఉట్నూర్

రాజీవ్ యువవికాస పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువత ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన గిరిజన నిరుద్యోగుల ఓబీఎం ఎంఎస్, టీజీఓబీఎంఎంఎస్ఎన్.ఈడబ్ల్యూ. సీజీజీ. జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ కార్యాలయం లేదా సంబంధిత జిల్లా డీడీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఖురాన్ పారాయణ ముగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రఖ్యాత విద్యా సంస్థ అయిన క్రీసెంట్ కళాశాల, ఎంఎస్ నెట్ అకాడమీ ఛైర్మన్ ముహమ్మద్ బిలాల్ పర్యవేక్షణలో మూడు సంవత్సరాలుగా మహిళలకు ఖురాన్ శ్రవణం, ఖురాన్ వ్యాఖ్యానం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని హజ్రత్ మౌలానా ముహమ్మద్ అక్బరుద్దీన్ హుస్సామి నక్షబందీ మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆయన ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సంవత్సరం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొంటున్నందున, మరింత మంది మహిళలు ఇందులో పాల్గొనేలా ఉర్దూ ఘర్ షాదీ ఖానాలో ఈ ఖురాన్ వినే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో మౌలానా ముహమ్మద్ అక్బరుద్దీన్ హుస్సామి తన ప్రసంగం ద్వారా ఆధ్యాత్మిక సందేశం అందించారు. కార్యక్రమం చివరలో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమం ముగింపులో ముహమ్మద్ బిలాల్ క్రీసెంట్ కాలేజీ, ఎంఎస్ నెట్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ సన్మానం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారా విలువలను కాపాడుకుంటూ, విద్యలో ముందుకు సాగాలని సూచించారు

సోషల్ మీడియాలో ఆదిలాబాద్ యువతుల హవా

- ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, యూట్యూబర్స్‌గా రాణిస్తున్న యువత
- ఆర్థికంగా ఎదుగుతూ ఫెమాస్ అవుతూ
- సినిమా అవకాశాల కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి తరం సోషల్ మీడియాలోనే ఉంటుంది. చిన్నవాళ్ళ నుండి పెద్దవాళ్ళ వరకు ప్రతి ఒక్కరు సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ ప్రచారాలకు, ప్రయివేటు ప్రమోషన్‌లకు, ప్రచారాలకు, కళలను ప్రదర్శించడానికి, సమాచారానికి ఇతర వాటికి సోషల్ మీడియానే ఆధారమైంది. దేనికైనా సరే అరచేతిలో ప్రపంచమే ఉంటుంది. సామాజిక మధ్యమాన్నే వినియోగించుకుంటు స్టేటస్ అప్‌డేట్ చేస్తున్నారు. కాగా సోషల్ మీడియా ద్వారా కొందరు రాణిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు కూడా. ఆదిలాబాద్ పట్టణంలో కొందరు యువతులు తమ కళలతో ఇంస్టాగ్రామ్, యూట్యూబ్‌లో రాణిస్తున్నారు. ఇంస్టాగ్రామ్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ హవా నడుస్తోంది. వీరికి పక్క ఆదిలాబాద్ అనే పేజీ సపోర్ట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో పలు వీడియోస్, షార్ట్స్, యాక్టింగ్, డ్యాన్స్‌తో వివిధ రకాలుగా ఫెమాస్ అయిన కొందరి యువతులతో నవతెలంగాణ ప్రత్యేక కథనం మీకోసం.

యాక్టింగ్ తో అదరగొడుతూ.. ప్రమోషన్స్ చేస్తూ

పట్టణానికి చెందిన రియా అనే అమ్మాయి ఇంస్టాగ్రాంలో వీడియో పోస్ట్, తన యాక్టింగ్‌తో అదరగొడుతూ అందరిని ఆకట్టుకుంది. ఆమె నటనకు అందరూ ఫిదా అవుతున్నారు. వీడియో, ఆడియో ప్రమోషన్స్ కూడా ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో ఆర్థికంగాను ఆమెకు ఉపయోగపడుతుంది. ఆమె మాట్లాడుతూ సీసీఐ రామాలయం వీడియో తీసి ఆలయాన్ని ప్రమోషన్ చేసే క్రమంలో నేను కూడా



సోషల్ మీడియాలో ఇంట్రడ్యూస్ అయ్యాను. ఆ వీడియో సక్సెస్ కావడంతో అలా ముందుకు సాగుతూ వచ్చాను. ముందుగా ఇలాంటివి వద్దని మా ఆయన సపోర్ట్ చేయలేదు. ఆ తర్వాత వీడియో చూసి ఆయనకు నచ్చడంతో చేయమని ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహంతోనే ప్రస్తుతం సోషల్ మీడియాలో వీడియోస్ చేస్తున్నాను. పలు షాపింగ్ మాల్స్ ప్రమోషన్ కోసం పిలవడం ఆ వీడియోస్ చేయడంతో ఇందులో సక్సెస్ అవుతూ వస్తున్నాను. అమ్మవారి గెటప్ చేయడం అంటే ఇష్టం. ఇంకా విలన్ క్యారెక్టర్ చేయడం కోసం చూస్తున్నాను. ఇంస్టాగ్రాంలో పక్క ఆదిలాబాద్ పేజ్ సపోర్ట్‌గా నిలిచింది. వీడియో తీయడం, ప్రమోషన్ చేయడంలో రవితేజ, శైలేందర్ చాలా సహాయపడతారు.



ఇంకా ఫెమాస్ ఐపోవాలి



సోషల్ మీడియా వేదికగా మోటివేషన్, జీవిత సత్యలతో కూడిన కొటేషనన్స్, వీడియోస్ షార్ట్స్ తీస్తూ ఆమె అందరిని ఆకట్టుకుంది. ఆ వీడియోస్ కొందరు వాట్సప్ స్టేటస్ పెట్టుకోవడంతో ఆమె ఫెమాస్ అవుతూ వస్తుంది. ఆమెనే పట్టణానికి చెందిన పందిరి జ్యోతి. ఒకప్పుడు టిక్ టాక్ వీడియోస్ తీస్తూ అందరిని ఆకట్టుకుంటు ఫాలోయింగ్ పెంచుకున్నారు. టిక్ టాక్ బ్యాన్ అయ్యాక ఇంస్టాగ్రాంలో కంటిన్యూ చేసానని చెప్పారు. మెల్లమెల్లగా వీడియోస్ క్వాంటిటి, క్వాలిటీ పెంచుతూ రావడంతో ఫాలోయింగ్ పెరిగింది. ఇలా వీడియోస్ చేయొద్దని చుట్టూ ఉన్న వాళ్ళు కొందరు ప్రోత్సాహించకపోయిన.. ఇంట్లో ఫ్యామిలీ వాళ్ళు మాత్రం బాగా సపోర్ట్ చేశారు. పెళ్లయ్యాక అత్తమామలు భర్త కూడా చాలా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. వాళ్ల సపోర్ట్‌తోనే ప్రస్తుతం ఈ పొజిషన్‌లో ఉన్నాను. యూట్యూబ్‌లో వీ లాగ్స్ చేయడం ప్రారంభించాను. ఇంకా మరెన్నో మంచి యూట్యూబ్ కంటెంట్, ఎంటర్‌టైన్మెంట్ కంటెంట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాను. ఫ్యాషన్ డిజైనర్ కావాలని నా లక్ష్యం ఉండేది. ప్రస్తుతం ఈ వీడియోస్‌తో సోషల్ మీడియా వేదికగా కొనసాగుతున్నాను. సినిమాలో కానీ షార్ట్ ఫిల్మ్‌లో కానీ అవకాశం వస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నా వీడియో కంటెంట్ బాగా నచ్చడంతో షాపింగ్ మాల్స్ ఇతర వాటికి ప్రమోషన్స్ కూడా వస్తున్నాయి. దాంతో ఆర్థికంగాను తోడ్పడుతుంది.

హీరోయిన్ కావాలన్నదే లక్ష్యం

వయస్సు చిన్నదే అయిన యాక్టింగ్, డ్యాన్స్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. చూడడానికి ఒక హీరోయిన్ మాదిరిగానే కనిపిస్తుంది. తనకంటూ ఒక పేరు ఉండాలని తాను కూడా సినిమాలో హీరోయిన్‌గా నటించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆమెనే పట్టణానికి చెందిన పల్లికొండ యోగిత. చిన్నప్పటి నుండి డ్యాన్స్ అంటే ఇష్టం. మా అన్నయ్య, వాళ్ళ స్నేహితులు వీడియోస్, షార్ట్స్ చేస్తుంటారు. ఒక సందర్భంలో ఒక సాంగ్‌లో అనుకోకుండా ఒక షూటింగ్‌లో డ్యాన్స్ చేసే అవకాశం వచ్చింది. ఆ వీడియో సక్సెస్ కావడంతో నాకు కూడా దానిపై మక్కువ ఇంట్రెస్ట్ పెరగడంతో ముందుకు సాగానని చెబుతోంది. కవర్ సాంగ్, షార్ట్స్ చేసాను షార్ట్ ఫిల్మ్ తీద్దామన్న ఆలోచనతో ఉన్నాను. ఫిల్మ్ ఇండస్ట్రీలో అవకాశం వస్తే వెళ్ళడానికి రెడీగా ఉన్నాను. అలాగే ఆర్థికంగా సపోర్ట్ దొరికితే ఫ్యాషన్ డిజైనర్, మోడలింగ్ కావాలన్న ఇంట్రెస్ట్ ఉంది. ఇలా వీడియోస్ తీయడానికి చేయడానికి ఇంట్లో సపోర్ట్ ఉంది. ముఖ్యంగా మా అన్నయ్య సపోర్ట్ ఉంది.





అడవి జంతువును హతమార్చిన వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అడవి జంతువులను హతమార్చిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ తెలిపారు. సమాచారం మేరకు శనివారం రాత్రి లోడ్పల్లి గ్రామ శివారు కొత్తవాడ సమీప అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. ముగ్గురు అనుమానాస్పద అధికారులను చూసి వారి చేతులలో ఉన్న మాంసపు సంచులను అక్కడే పడవేసి పారిపోయారు. అటవీశాఖ సిబ్బంది వారిని వెంబడించి కొత్తవాడకి వెళ్లి విచారించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆదివారం ఉదయం విచారణలో భాగంగా సంఘటన స్థలం వద్ద వెతకగా సిబ్బందికి చుక్కల దుప్పి చర్మం లభించిందని తెలిపారు. విచారణ అనంతరం లోడ్పల్లి గ్రామానికి చెందిన గొర్లపల్లి శేఖర్, బొల్లబోయిన గంగయ్య, అత్రం శంకర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైన అటవీ జంతువులను హతమారిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులనే పట్టుకున్న వారిలో ఎఫ్ఎస్ఓ వేణుగోపాల్ రావు, బీట్ అధికారులు లచ్చన్న, సతీష్, వహేష్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష తత్పరుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు వెనక్కి తగ్గలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సురవరం ప్రతాపరెడ్డి పేరును మరేదైనా నూతన యూనివర్సిటీకి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు చిలువేరి వెంకటేశ్వర్లు, గంధం శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, గుండా ప్రమోద్, గుండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూలజిబాబా 4వ వార్షికోత్సవ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

17, 18 రెండు రోజుల పాటు వాంకిడి మండలంలోని కమాన గ్రామంలో నిర్వహించే పులాజి బాబా ధ్యాన మందిర నాలుగో వార్షికోత్సవ పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులాజిబాబా ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ధ్యాన మందిర అభివృద్ధి కోసం తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండాశ్యామ్, జిల్లా నాయకుడు శివప్రసాద్, ఖలీం, రమేష్, మారుతి పటేల్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. జిల్లాలో గతంలో మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపీపీ కప్-2025 సీజన్ 4 విజేతలకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధాన కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలమన్నారు. ఆరేండ్లుగా ఎంపీపీ కప్ నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులలో వారిలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి అరిగెల బ్రదర్స్ చేస్తున్న కృషిని అభినందించారు. యువత కూడా వారు ఎంచుకున్న క్రీడ రంగంలో రాణించేల నిత్యం సాధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సుభాష్, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునందన్, కోచులు, పీటీలు, పీడీలు పాల్గొన్నారు.

క్రీడలు ఆటవిడుపుగా ఉంటాయి : సీఐ



నవతెలంగాణ-రెబ్బెన

ఎప్పుడు తమ విధులతో తీరికలేకుండా ఉండే పోలీసులు కాస్త ఆటవిడుపుగా ఆదివారం రెబ్బెన మండల రిపోర్టర్లతో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. సీఐ బుద్దే స్వామి నాయకత్వంలో పోలీసుల టీం జగడం సత్యనారాయణ నాయకత్వంలో పాత్రికేయుల టీం తలపడింది. ఈ ఆటలో 35 పరుగుల తేడాతో పోలీస్ టీం విజయం సాధించింది. అనంతరం విజేతలకు, రన్నర్ టీంకి బహుమతులు అందజేశారు. విధి నిర్వహణలో బీజీబీజీగా ఉండే పాత్రికేయులు, పోలీసుల మధ్య స్నేహపూర్వకంగా మ్యాచ్ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఆటలతో మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : ఎస్సై



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తామని బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బండలగూడ గ్రామంలో వాలీబాల్ క్రీడాకారులకు వాలీబాల్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా మండలంలోని క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. యువత కూడా అసాంఘిక కార్యకపాలతో పాటు చేడు వ్యాసానాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్య రంగానికి నిధులు కేటాయించాలి



రౌండ్ టెబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో విద్య, యువజన రంగాలకు ప్రస్తుత బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకే సాయికుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని, సంవత్సర జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని యూత్ డిక్లరేషన్ అమలు చేస్తామని హామి ఇచ్చిందని వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో విద్య, ఉపాధి, ఉద్యోగం కోసం అధిక నిధులు కేటాయించాలని వాటితో పాటు క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రతి మండల కేంద్రంలో క్రీడా మైదానాలు నిర్మాణానికి ప్రత్యేక బడ్జెట్ అందించాలన్నారు. ప్రతి మండలంలో గ్రంథాలయాలను నిర్మించి యువతకు చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ అందించాలన్నారు. జిల్లాలో బీజేపీ కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించినప్పుడే విద్యారంగం అభివృద్ధి అవుతుందని, జిల్లాకి సాంకేతిక విద్య అందించే విధంగా పాలిటెక్నిక్ ఐటీఐ, ఐఐటీ, త్రిబుల్ ఐటీ, కాలేజీలను మంజూరు చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె.రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి బొగే గిరి కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యురాలు కుందూరపు మంజుల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ : కాంగ్రెస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ దొరల అహంకారంతో ఉన్న దళిత వ్యతిరేక పార్టీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆరోపించారు. పీసీసీ పిలుపు మేరకు దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి దహనం చేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళితుల జోలికి వస్తే సహించేది లేదన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేశారన్నారు. కేటీఆర్‌కు దళితులపై ఎంత ప్రేమ ఉందో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు స్పీకర్‌ను ఆ పార్టీ అవమానించిందన్నారు. పదేండ్ల ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలని, దళిత స్పీకర్‌ను అవమానించడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేసిందన్నారు. ఏకంగా అసెంబ్లీ సభాపతిని దళితుల్ని నియమించి దళితుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు దళితుల పెత్తనం ఓర్వలేక కించపరిచే కార్యక్రమాన్ని చేపడుతున్నారని మండిపడ్డారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తా అంటూ మాట తప్పడమే కాకుండా దళితుల పట్ల అనుచితంగా వ్యవహరించడం సరికాదన్నారు. కేసీఆర్ ఒక్కసారి కూడా అసెంబ్లీకి హాజరు కాకుండా లక్షల రూపాయల జీతం తీసుకున్న అసమర్థ నాయకుడని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిల్లా యువజన అధ్యక్షుడు గుండా శ్యామ్, జిల్లా నాయకులు ఖలీం, శివ ప్రసాద్, సురేష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ పాల్గొన్నారు.

తిర్యాణి : దళితుల జోలికి వస్తే సహించేదిలేదని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పడిగెల అమర్ అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ దళితుల అభ్యున్నతికి పెద్దపీట వేసిందన్నారు. ఏకంగా అసెంబ్లీ సభాపతిని దళితుల్ని నియమించి దళితుల పట్ల తమకున్న



ఆసిఫాబాద్ : కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ నాయకులు దళితుల పెత్తనం ఓర్వలేక కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామంటూ మాట తప్పడమే కాకుండా దళితుల పట్ల అనుచితంగా వ్యవహరించడం సరికాదని బీఆర్ఎస్‌కు హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, మండల నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, యూత్ అధ్యక్షుడు పున్నం కుమార్, ఉపాధ్యక్షుడు పోలిశెట్టి రాజు, నాయకులు బుద్దే విజయ్, బొల్లం శంకర్, చుంచు బాబురావు, బుద్దే శేఖర్, జగన్, రామ్‌చందర్, మేడిశెట్టి శంకర్, పులి కొమురయ్య, బుద్దే చిన్నయ్య, పులి వెంకటేశం పాల్గొన్నారు.

వాంకిడి : దళితుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని ఎన్‌హెచ్‌ఏఐ 363 జాతీయ రహదారిపై జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ దళితులకు పెద్దపీట వేసిందన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి దళితులను అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని, వెంటనే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పై ఏదిపడితే అది మాట్లాడితే ఊరుకోబోని, మరోసారి ఇలా దళితులను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తిర్యాణి : కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న నాయకులు



వాంకిడి : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో భవిష్యత్తులో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో గతంలో పరిపాలించిన బీఆర్ఎస్‌పై, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారని భవిష్యత్తులో తమ పార్టీ ప్రభుత్వం రానున్నదని పట్టభద్రులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన ధోని శ్రీశైలం పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గడపగడపకు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల్లో పార్టీ విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. కుమురం భీం జిల్లాలో వనరులు ఉన్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అందరి సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ జిల్లా అధ్యక్షునికి సూచించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ నూతనంగా పదవి స్వీకారం చేసిన జిల్లా అధ్యక్షుడిపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చర్చించినట్లు పేర్కొన్నారు. కేవలం 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం డబల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చక పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలతో పాటు పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో చర్చించాలని ఎమ్మెల్సీని కోరారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత మొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీని, జిల్లా అధ్యక్షున్ని శాలువా కప్పి సన్మానించారు. అంతకు ముందు శ్రేణులు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్యక్రమంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగేల నాగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా నాయకులు విజయ్, మురళి, గోనే శ్యాంసుందర్, మల్లారెడ్డి, రఘునాథ్, కృష్ణకుమారి, సొల్లు లక్ష్మి, ఏమాజీ, బోనగిరి సతీష్, ప్రసాద్ గౌడ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు పెంటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ నుంచి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గు రవాణ చేసే లారీ టిప్పర్ సోనాపూర్ బ్రిడ్జి దగ్గర కింద పడిందని దీనికి కారణం సింగరేణి అధికారులే అని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. ప్రమాదానికి కారణమైన సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన స్థలానిన పరిశీలించి మాట్లాడారు. లారీలో బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ చేసే సమయంలో నిబంధనలకు వ్యతిరేకంగా అధికలోడు చేయడమే కారణమని, అలాగే డ్రైవర్లపై ఒత్తిడి తెచ్చి ప్రతిరోజు 12 నుంచి 15 ట్రిప్పులు కొట్టాలని, సింగరేణి అధికారులు ఒత్తిడి తేవడం వల్ల ప్రమాదం జరిగిందని అన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం ఎనిమిది గంటల పని విధానం ఉంటే సింగరేణి అధికారులు లారీ డ్రైవర్ అండ్ క్లీనర్లతో 24 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. కనీసం వారికి క్యాంటీన్ సౌకర్యం కూడా కల్పించలేని దౌర్భాగ్యమైన స్థితిలో బెల్లంపల్లి ఏరియా అధికారులు ఉన్నారని, బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు. ప్రమాదం జరిగిన చోట కనీసం స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కూడా లేవని దీనికి అంతటికి సింగరేణి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా గాయపడిన డ్రైవర్ సతీష్‌కు కార్పోరేట్ వైద్యం అందించాలని, ప్రతిరోజు ఆయనకు మాస్టర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ఏరియా జనరల్ మేనేజర్ భాస్కర్ రెడ్డి కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నాయకులు తిరుపతి, సాయి ఉన్నారు.

మహంకాళీ జాతర పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో ఏప్రిల్ 12, 13 తేదిల్లో నిర్వహించే మహంకాళీ జాతర పోస్టర్లను ఆలయ కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. 12న శివ పార్వతుల కల్యాణం,13న మహంకాళీ అమ్మవారి పుట్టిన రోజు జాతర, బోనాల సమర్పణ, రథోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవర వినోద్ స్వామి, ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్, దుర్గం తిరుపతి, సల్వా కనకయ్య, కమ్మొరి మల్లేష్, మస్కా రమేష్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సుగుణక్క



నవతెలంగాణ-జైనూర్

ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమంలో భాగంగా ఈనెల చివరి వారంలో లింగాపూర్ మండలం చోర్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రెండు రోజుల పాటు పర్యటిస్తారని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం ఏర్పాట్లను పరిశీలించటానికి ఆత్రం సుగుణక్క చోర్‌పల్లి గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ గిరిజన, ఆదివాసీ గూడల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవటానికి మీనాక్షి నటరాజన్‌తో పాటు మంత్రి సీతక్క, శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు చుట్టుపక్కల ఉన్న ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రెండు రోజుల పాటు పర్యటించి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ఇందిరా ఫెలోషిప్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సోయం ముకుంద్, మాజీ సర్పంచ్ మర్సుకోల మనోహర్, సునీల్, ధర్మరావ్ పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని వీరవెల్లి గ్రామంలో పనిచేయకుండా ఉన్న చేతిపంపుపై శనివారం నవ తెలంగాణలో వార్త ప్రచురితం కాగా ఎంపీడీఓ కోట ప్రసాద్ స్పందించారు. వెంటనే చేతి పంపుకు మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేలా ఆదేశాలు చేశారు. దీంతో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఆదివారం చేతి పంపుకు మరమ్మత్తులు చేసి వాడుకలోకి తీసుకువచ్చారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | మార్చి 17, 2025 | www.navatelangana.com

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం



మండలం గడ్డంగూడెం ఆదివాసీ గిరిజనలు సమస్యలపై సీపీఐ(ఎం) చేపట్టిన సర్వే ఆదివారం కొనసాగింది. జిల్లా కార్యదర్శివర్గం సభ్యులు కనికరపు అశోక్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు అబ్దులా, మండలం నాయకులు గడ్డం విజయ్ గ్రామ నాయకులు మూర్తి రాజాం, బుర్ర సత్తయ్య,గడ్డం పెద్దరాజాయ్య, అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ఆదివాసి గూడెంలో ఎదురయ్యేటువంటి ప్రధాన సమస్యలు జన్నారం నుంచి గడ్డం గూడెం వరకు రోడ్డు వెయ్యాలని, ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు పట్టాలు కల్పించాలని, ఫారెస్ట్ అధికారుల యొక్క వేధింపులు అరికట్టాలని ఆదివాసీలు సర్వే బృందానికి తెలియజేశారని అశోక్ తెలిపారు. అదేవిధంగా మంచినీటి సమస్య రేషన్ కార్డులు, ఉపాధి జాబ్ కార్డులు, ఆ గ్రామస్తులకు అందించాలని తెలిపారు.

కాంట చౌరస్తా వద్ద అన్నదానం

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి పట్టణంలోని కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆద్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో 320వ వారాల అన్నదాన కార్యక్రమంలో యాచకులకు, నిరుపేదలకు, దినసరి అడ్డ కూలీలకు, బాటసారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్, దాతలు కర్రే జ్యోతి, వశిష్ఠ, గొల్ల రాజేందర్, గొల్ల సాగర్, అచ్చ ప్రదీప్, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నెవరం తిరుమల చారి, సిద్దమల్ల రఘు, బాలకృష్ణ, ఎండీ యుసుఫ్, చెందుపట్ల లింగమూర్తి, సల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ. 500 వేల కోట్లు కెటాయించాలి

- టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణ



నవతెలంగాణ-మంచిర్యాల

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రాబోవు బడ్జెట్‌లో రూ. 500 వేల కోట్లు కెటాయించాలని తెలంగాణ మత్స్యకారుల మచ్చ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాలలో జిల్లా ముఖ్యబాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బొడెంకి మహేష్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో గత ప్రభుత్వంలో గాని ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల అభివృద్ధికి చేసింది ఏమీ లేదని అన్నారు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ, ఉచిత చేప పిల్లల పంపిణీలో కోట్ల అవనీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మత్స్యకారులకు రావాల్సిన ప్రభుత్వ నిధులు, మిషన్ కాకతీయ, చేప పిల్లల వల్ల కాంట్రాక్టర్లు అభివృద్ధి చెందారు తప్పితే మత్స్యకార్మికులకు చేకూరిన లాభం ఏమీ లేదని అన్నారు. ప్రస్తుత పాలనలో పిల్లలు కూడా ఇవ్వకపోగా ఉచిత చేప పిల్లలకు బదులుగా సొసైటీ అకౌంట్లు డబ్బులు వేస్తే మత్స్యకారులు నాణ్యమైన చేప పిల్లలను కొనుక్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు రూ. 5 వేల పింఛనః ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా జిల్లా కార్యదర్శి బోడంకి చందు మాట్లాడుతూ మహిళా సొసైటీకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మండల జిల్లా కేంద్రాల్లో మత్స్య మార్కెట్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండె ప్రమీల, తుమ్మ రేణుక, రమాదేవి, పద్మ, పానెం రాజన్న, గగ్గూరు రాజేష్, శ్రీనివాస్, మహేష్, గుమ్మల శ్రీనివాస్, ఆశన్న రాజు పాల్గొన్నారు.

భూ వివాదాలకు తక్షణ పరిష్కారం

- పోలీస్, రెవిన్యూ శాఖల ప్రమేయం
- జిల్లా, డివిజన్ స్థాయిలో కమిటీల ఏర్పాటు

నవతెలంగాణ-తాండూర్

భూ ఆధారిత ఉత్పత్తులు పెరిగిపోవడంతో వ్యవసాయ భూముల రేట్లు పెరిగిపోయాయి. సొంత భూమి ఉన్న యజమానులకు కౌలు, బాటకం, రైతుబంధు రాబడులతో పెట్టుబడిదారులు భూమి కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం భూమి యాజమాన్య హక్కులను పకడ్బందీగా నిర్వహించడం, రైతు బీమా వంటి పథకాలను వర్తింపజేయడంతో భూమి విలువలు పెరిగాయి. భూమి కొనుగోలు వ్యవహారంలో పెట్టుబడిదారుల పోటీ తత్వం పెరగడంతో గ్రామాల్లో అదే రీతిలో భూ వివాదాలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులు అమాయకులైన ప్రజల మధ్య వివాదాలు సృష్టించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. దాంతో అమాయక ప్రజలు భూమి వదులుకోవడం లేదా తక్కువ ధరకు అమ్మడమో చేస్తున్నారు. పేద రైతులు కోర్టుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. న్యాయస్థానాల్లో దశాబ్దాల తరబడి కేసులు నోచుకోవడం లేదు. కారణంగా భూ వాదాలు దాడులకు హత్యలకు దారి తీసుకున్నాయి.

ప్రతి సోమవారం భూ సమస్యల పరిష్కార వేదిక

జిల్లా ప్రజావాణి దరఖాస్తుల ద్వారా భూ వివాదాల పరిస్థితులను గమనించిన కలెక్టర్ కుమార్ దీపక్ సమస్యల పరిష్కారానికి కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ అధికారులు భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివాదాలకు సంబంధించి అర్జీలు తీసుకుంటారు. వీటిని ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేసి బాధితులకు ప్రత్యేక నెంబరు ఇవ్వ నున్నారు. కమిటీ సభ్యులు దీనిపై విచారణ నిర్వహించడంతోపాటు అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటి స్తారు. అందిన ఫిర్యాదును గరిష్టంగా 21 రోజుల్లో పరిష్కరించనున్నారు. ఏదైనా కారణంగా ఆలస్యం జరిగితే జిల్లా కమిటీకి సమాచారం అందించాల్సి ఉంటుంది.



బెల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదిక (ఫైల్)

కమిటీల ఏర్పాటు

సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు సభ్యులుగా ఉంటారు. డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, ఏసీపీలు సభ్యులుగా, మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్ఐలు సభ్యులు, మండల స్థాయిలో అవసరాన్ని బట్టి ఆయా మున్సి పల్ కమిషనర్లు, ఎంపీఓలు భాగస్వాములుగా ఉంటారు.

సత్వర పరిష్కారానికి కృషి

ఇమ్రాన్ ఖాన్, తహసీల్దార్, తాండూర్

భూ వివాదాల పరిష్కార వేదిక గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. గ్రామ సహాయకులు పంచాయతీ సెక్రెటరీలు విలేజ్ పోలీసు వ్యవస్థల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. భూ వివాదాల వినతులను స్వీకరించి ఇరుపక్షాల వాదనలు వివాదానికి గల కారణాలు పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నాం. మండల స్థాయిలో పరిష్కారంకాని సమస్యలకు డివిజన్, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. పరిష్కార వేదిక ద్వారా భూవివాదాలకు పరిష్కారం లభించనుంది.

ఉద్యోగవిరమణ అనేది సహజం



నవతెలంగాణ-జన్నారం

ఉద్యోగులకు పదవి విరమణ సహజమని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజన్న అన్నారు. కామేర రాజేశ్వర్-పద్మావతి పీఎస్ హెచ్ఎం ఉద్యోగవిరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో నర్సరీ నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని అతను చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్ ఎస్సీ, ఎస్టీ, టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకటరావు ప్రముఖ కవి మురిమడుగుల రాజారావు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వివాహిత మృతి పట్ల అనుమానాలు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి మమత(35) మృతి పట్ల బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి గుండె పోటుతో మమత మృతి చెందినట్లు చెపుతుండగా మృతురాలి తోబుట్టువు గోమాస మౌనిక అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ శ్వేత తెలిపారు. 15 సంవత్సరాల క్రితం మమతను వివాహమాడిన అంగడి మల్లేష్ మానసిక అనారోగ్యంతో ఆస్థులు అమ్మేస్తున్నందున భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. వీరికి 13 సంవత్సరాల వయస్సు గల ఆడ కూతురు ఉండగా మానసిక అనారోగ్యంతో ఉన్న మల్లేష్ ఇంటి ఆస్థులు అమ్ముతున్నాడని తెలిపారు. ఈ విషయంలో భార్యభర్తల మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. కాగా ఆస్థుల అమ్మకానికి అడ్డుపడుతున్న మమతను హతమార్చి గుండెపోటుగా భర్త మల్లేష్ కుటుంబ సభ్యులు చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మృతురాలి తోబుట్టువు గోమాస మౌనిక ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

వైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య మహాసభ, మహిళా సంఘం, జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్మాస్ కాంతయ్య, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేపట్టి అమరుడయ్యాడని అన్నారు. ఆయన చూపిన మార్గంలో అహింస పద్ధతిలో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు చెట్ల రమేష్, రాజమౌళి, కట్కం రమేష్, తాటికొండ శ్రీనివాస్, కృష్ణమోహన్, మహేందర్, జిల్లా ఆర్యవైశ్య మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి నరెందుల సాహితి, రాధిక, లావణ్య, సంధ్య, అనూష, లతశ్రీ, సరిత, దివ్య, రమాదేవి ,ఆర్ పద్మ, వి పద్మ, దీపిక, టి పద్మ పాల్గొన్నారు.

బోనాల జాతరకు వేళాయే..!

- నేడే లక్ష్మిదేవి కళ్యాణోత్సవం
- ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో కొలువైవున్న లక్ష్మిదేవి జాతరకు ముదిరాజులు సర్వం సిద్ధం చేశారు. ముదిరాజుల ఆరాధ్య దైవంగా పూజిస్తున్న లక్ష్మిదేవి అమ్మవారితో క్రిష్ణమూర్తికి సోమవారం కల్యానోత్సవం జరిపించనున్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పండుగ తర్వాత వచ్చే మొదటి సోమవారం రోజున లక్ష్మిదేవి కల్యానోత్సవం జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. ఈ ఏడాది దేవతామూర్తుల విగ్రహాలకు రంగులు అద్దించడం కారణంగా పది రోజులు ఆలస్యంగా పండుగ నిర్వహిస్తున్నారు. ముదిరాజు కుల సంఘం ఆధ్వర్యంలో అన్నెవేని కుటుంబీకులు ప్రధాన పూజారులుగా సాంప్రదాయ పద్దతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సంధర్భంగా ముదిరాజ్ కుటుంబాలకు చెందిన మహిళలు మంగళహారతుల మధ్య నెత్తిన బోనం ఎత్తి ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. గ్రామానికి చెందిన కుటుంబాలు అమ్మవారి జాతరలో పాల్గొనడమే కాకుండా కల్యానోత్సవానికి ఒక్క రోజు ముందు కాలి నడకన గోదావరి నదిని చేరుకుని దేవతా మూర్తులను నది జలాలతో స్నానాలు చేయించడం జరుగుతుంది. అదే రోజు రాత్రి దేవతామూర్తులతో ముదిరాజ్ కుటుంబాల వారి ఆట పాట కన్నుల పండువగా జరుపుకుంటారు. చిన్నా పెద్దా లేకుండా ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్కరు కొత్తబట్టలు ధరించి జాతర వేడుకల్లో పాల్గొంటారు. గ్రామానికి చెందిన 180 ముదిరాజ్ కుటుంబాల వారితో పాటు వివిధ ప్రాంతాలలో ఉండే బంధు మిత్రులను ఈ వేడుకలకు ఆహ్వానించి పండగలన్నింటిలో మిన్నగా జరుపుకుంటారు. లక్ష్మిదేవి కళ్యానోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ముదిరాజ్ కుటుంబాల వారితో గ్రామానికి అంతా మంచి జరుగుతుందని ముదిరాజ్ కుటుంబాలు భావిస్తారు. 80 సంవత్సరాల క్రితం ముదిరాజ్ వాడలో నిలుపుకున్న లక్ష్మిదేవికి ముదిరాజ్ కుటుంబాల వారు గత 8 సంవత్సరాల క్రితం నూతన ఆలయం నిర్మించి దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. అమ్మవారి భోనాల జాతరకు ముదిరాజ్ కుటుంబాల వారు మాత్రమే కాకుండా ఇతర కుటుంబాల వారు వందలాధిగా తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని టేకుమట్ల గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రయివేటు పాఠశాలలకు దీటుగా కొనసాగుతోందని గ్రామస్థులు అభివర్ణించారు. పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు స్థానిక నాయకులు, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో అలరించారు. ఈ సంధర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత పట్ల విడమర్చిన విధానం ఆహూతులను ఆకర్శించింది. మండల విద్యాధికారి శ్రీనివాస్‌తో పాటు జిల్లా విద్యాశాఖ ప్రతినిధిగా చౌదరి, సత్యమూర్తి, శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ ప్రభాకర్‌రావు, మాదుర్య, పాఠశాల చైర్మన్ స్రవంతి, మాజీ సర్పంచ్ సుమలత, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి, మాజీ ఎంపీటీసీ రవి, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, రజినీకాంత్, సురేందర్ హాజరయ్యారు.

పద్మశాలి మార్కెట్ కమిటీ రద్దు

నవతెలంగాణ-మందమర్రి

పద్మశాలి మార్కెట్ కమిటీని రద్దు చేసి 5 గురు సభ్యులతో అడ్ హక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆదివారం మార్కెట్ ప్రాంతంలో పద్మశాలి మార్కెట్ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులందరి నిర్ణయం మేరకు పాత సంఘం అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ ప్యానెల్‌ను రద్దు చేశారు. తదుపరి అధ్యక్ష పదవి ఎన్నికలకు ఎన్నికల అడ్ హక్ కమిటీగా ఓ రాజశేఖర్, పుట్ట సదనందం, పిట్టల సుధాకర్, లక్సట్టి రమేష్, గొనె శ్రీనివాస్ అయిదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే ఎన్నికల నోటిఫికేషన్, సభ్యత్వ నమోదు ఉంటాయని తెలిపారు.

అడవి నుంచి ఇసుక తీస్తే కేసులు

నవతెలంగాణ-జన్నారం

ఎవరైనా తమ సిబ్బంది కండ్లు కప్పి అడవిలో నుంచి ఇసుకను తరలిస్తే కేసులు న మోదు చేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని ఇందన్‌పల్లి రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మా ట్లాడుతూ వాగులు, వంకల్లో నుంచి వ్యాపారం కోసం ఇసుకను తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని, ఇంటి అవసరాల రీత్యా తప్పకుండా మినహాయిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు గృహ నిర్మాణాలకు ఇసుకను ఎలాంటి అనుమతి ఇస్తామని, వ్యాపారం చేసే వారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అనుమతించే ప్రసక్తి లేదని అన్నారు. చెక్‌పోస్టుల మీదుగా కలప తరలిపోకుండా పకడ్బందీ చర్యలు చే పట్టడం జరిగిందని, ఎవరైనా ఇతర ప్రాంతాలకు కలపను తరలిస్తే వారి సమాచా రాన్ని తమకు తెలియజేయాలని, వారి పేర్లను గోప్యం ఉంచుతామన్నారు.



అక్రమంగా తరలిస్తు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని రామారావుపేట్ శివారు గోదావరినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు శనివారం రాత్రి రామారావుపేట్ శివారులో నిఘా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాజకుమార్, ఎస్సైలు ఉపేందర్, లచ్చన్నలు సిబ్బందితో కలిసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరినది ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గుండ శ్రీనివాస్, కొంతం చంద్రయ్య, బద్దెల సాయికృష్ణ, తంగెళ్లపల్లి వెంకటేశం ఆదేశాల మేరకు గత కొంత కాలంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్నట్లు ట్రాక్టర్ డ్రైవర్లు పూదరి రాజేశ్, పూదరి ప్రశాంత్, పెద్ది నరేందర్, కొంతం మధూకర్‌లు తెలిపినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలు దహనం

నవతెలంగాణ-మందమర్రి

దళితులపై బీఆర్ఎస్ వైఖరిని ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆదివారం కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీర్, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా చెన్నూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ నాయీమ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు దళిత నాయకుల పట్ల అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి ఏక వచనంతో మాట్లాడి సభా మర్యాదను మంట గలిపారని అన్నారు. గతంలో ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ని అసెంబ్లీ నుంచి బర్తరఫ్ చేశారు. లోక్ సభ స్పీకర్‌గా తెలంగాణ బిల్లు పాస్ చేసిన మీరా కుమార్ తెలంగాణకు వచ్చి కేసీఆర్ అపాయింట్మెంట్ అడిగితే ఇవ్వలేదన్నారు. దళిత ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేశారని, ఇలా అనేక రకాలుగా దళితులను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేవెల్లి శ్రీకాంత్, నోముల రాజేందర్, అసెంబ్లీ సెక్రటరీ నవీన్, చెన్నూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ జనరల్ సెక్రెటరీ వడ్లూరీ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : అసెంబ్లీ సాక్షిగా దళిత స్పీకర్ ప్రసాద్ కుమార్‌పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు మండల, పట్టణ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్ మాట్లాడుతూ దళిత స్పీకర్ అయిన గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు. గత పది సంవత్సరాలుగా అసెంబ్లీలో అధికారంలో ఉండి నియమ నిబంధనలు తెలిసి కూడా ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమని తెలిపారు. ఇలాంటి వాక్యలే కొనసాగిస్తూ ఉంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, ఆర్టీఏ డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు సయ్యద్ షాహిద్ ఆలీ, నవాబ్ ఖాన్ పాల్గొన్నారు.



మందమర్రిలో..

కాసిపేట : మండలంలోని కొండాపూర్ యాపలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాజమౌళి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మల దహనం చేశారు. అనంతరం సీనియర్ నాయకులు రాజమౌళి, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య మాట్లాడుతూ 10 ఏళ్లలో మాజీ సీఎం కేసీఆర్ ఈ రాష్ట్రంలో నిరంకుశ పాలన చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఒక దళిత స్పీకర్ ని అవమానించిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని శాశ్వతంగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జనార్దన్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండ శ్రీనివాస్, రాజిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, ఉత్తురి సత్తయ్య మాజీ సర్పంచ్ దరావత్ దేవికొండయ్య, బీమ్లానాయక్, అజ్మీర్ తిరుపతి, భూక్య రవి, కాసాడి శ్రీనివాస్, సాయి కిరణ్, బొగ్గుల నర్సయ్య మహంకాళి, సుంకె రాజ మోగిలి, నందం, వెంకటేష్ పాల్గొన్నారు.

తాండూర్ : కేసీఆర్, జగదీశ్వర్ దిష్టి బొమ్మలను ఆదివారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్, సిరంగి శంకర్, జనరల్ సెక్రటరీ జుబైర్, పట్టెం విష్ణు, సింగరావ్ శ్రీధర్, మంతెన శివ పాల్గొన్నారు.

జైపూర్ : చెన్నూర్ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుల దిష్టి బొమ్మలను దహనం చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల అగౌరవంగా మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధి వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..



కాసిపేటలో..